క్లుప్తంగా

రహదారి నిర్మాణం చేపట్టాలి



అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఉండి: మండలంలోని యండగండి శివారు ప్రాంతమైన రాయనివానిగూడెంలోని ఆర్‌అండ్‌రోడ్డు అధ్వానంగా మారడంతో ఆ ప్రాంతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు స్థానికులు చెబుతున్నా రోడ్డు మాత్రం నిర్మించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం రోడ్డు నిర్మాణ సంగతినే మర్చిపోయారని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజూ విద్యార్థులు స్కూల్, కాలేజీలకు వెళ్లాల్సిన వారు ఆటో సదుపాయం కూడా లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 3.5 కిలోమీటర్ల దూరం నడిచి ప్రయాణాలు చేయలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువై పది నెలలు కావస్తున్నా ఇంత వరకు ఈ రోడ్డును పట్టించుకోకపోవడం దారుణమని వారు వాపోతున్నారు. అలాగే మహిళలు ప్రయాణాలు చేసేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి రోడ్డు దుస్థితిని గమనించి నిర్మించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

మీటింగులతో ఉపాధ్యాయులను హింసించొద్దు

భీమవరం: క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగుల పేరుతో సరైన ప్రణాళిక లేకుండా సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులకు తీవ్రమైన ఇబ్బంది కలుగజేయడం సరికాదని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలోని అత్యధిక పాఠశాలల్లో అంతర్జాల సదుపాయం లేదని, ఒక క్లస్టర్ పరిధిలో ఒకటి లేదా రెండు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉండడం వల్ల హాజరైన అతికొద్ది మంది పాఠశాల సహాయకులు ఏడు గ్రూపులుగా విడదీయడం వలన ఒక గ్రూపులో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉండడం వల్ల బోధనాభ్యాసన అంశాల గురించి చర్చకు తావు లేదని తెలిపారు. అలాగే ఒకటి రెండు తరగతులు బోధించేవారికి, మూడు, నాలుగు, ఐదు తరగతులను బోధించే వారికి వేరు చేయడం సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరును తప్పనిసరి చేయడం, సమావేశమై అరగంట దాటితే అనుమతించకపోవడం అధికారులకు ఉపాధ్యాయులపై గల దురభిప్రాయం బయటపడుతుందన్నారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ



సంత మార్కెట్‌లో క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: మన ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ నిషేధించాలని ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంత మార్కెట్‌లో ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా జిల్లా కలెక్టర్, యంత్రాంగం ప్రత్యామ్నాయలు ఏర్పాట్లు చేశారని, వాటిని వినియోగించుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో అందరూ భాగస్వాములై స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. అనంతరం గ్రంధి వెంకటేశ్వరరావు సంత మార్కెట్‌లో 200 మంది ప్రజలకు వబిలిశెట్టి రామకృష్ణ, కంతేటి వెంకటరాజు సహకారంతో క్లాత్ బ్యాగును సంచులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, రామాయణం సత్యనారాయణ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల మూటల తొలగింపు



కోళ్ల మృత కళేబరాల మూటలను పూడ్చి బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

పాలకోడేరు: రేలంగి చానల్ నుంచి కొట్టుకొస్తున్న కోళ్ల వ్యర్థాల మూటలను డీపీవో అరుణశ్రీ ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ సమక్షంలో మోగల్లు పంచాయతీ కార్యదర్శి సుజాత పొక్లెయిన్‌తో తొలగించారు. బర్డ్‌ఫ్లూ వ్యాధితో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అయితే వాటిని పౌల్ట్రీ యజమానులు శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేయకుండా మూటలు కట్టి కాలువల్లో పారేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మోగల్లు పంచాయతీ కార్యదర్శి సుజాత, ఈవోపీఆర్డీ కాలువ పొడువునా గోతులు తవ్వించి ఖననం చేశారు. అనంతరం బ్లీచింగ్, శానిటేషన్ చర్యలు చేపట్టారు. నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?

- కాలుష్యపు కోరల్లో పంట కాలువలు
- కర్రనాచు, తూడుతో నిండిపోయిన వైనం
- నీరందక అన్నదాతల గగ్గోలు
- ప్రక్షాళన చేయాలని కోరుతున్న రైతులు



వీరవాసరం: పంట కాలువల్లో పేరుకుపోయిన నాచు, తూడు



ఆకివీడు: ప్లాస్టిక్, కుళ్లిన వ్యర్థాలతో నిండిన మూలలంక పంట కాలువ

వీరవాసరం: సాగునీరు పూర్తిస్థాయిలో పంట చేలకు చేరక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పంట కాలవల ప్రారంభంలో గట్లను తాకుతూ నీరు వస్తున్న, శివారు ప్రాంతాలకు వచ్చేసరికి సాగునీరు అందడమే గగనమైపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరవాసరం మండలంలో సుమారు 13 హెక్టార్లలో వరి సాగవుతుంది. వరి పంటకు జీఎన్వీ కెనాల్ నుంచి రాయకుదురు, కొణితివాడ, అండలూరు, శృంగవృక్షం గ్రామాల నుంచి ప్రధాన కాలువల ద్వారా సాగునీరు అందుతుంది. జీఎన్వీ కెనాల్ నుంచి పంట నీరు వస్తున్నప్పటికీ పంట కాలువల్లో పూడిపోయిన గుర్రపు డెక్క, చెత్తా చెదారాలతోపాటు ముఖ్యంగా కర్రనాచు పెద్ద ఎత్తున కాలువల్లో పేరుకుపోయింది. అసలే ప్రస్తుతం వంతులవారీ విధానంతో పంట చేలకు సాగునీరు అందిస్తున్నారు. మత్స్యపురిపాలెం, దూసనపూడి కమతాలపల్లి కాలువపై గత 25 రోజుల క్రితం గుర్రపు డెక్క, తూడు పేరుకుపోవడంతో నిర్మూలన మందును పిచికారీ చేశారు. తూతూ మంత్రంగా పిచికారీ చేయడంతో మరలా తిరిగి యథావిధిగా తూడు కాలువలో పేరుకుపోయిందని రైతులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి కర్రనాచును తొలగించి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని కోరుతున్నారు.

వ్యర్థాలకు నిలయంగా మూలలంక పంట కాలువ

ఆకివీడు: పేదల గుడిసెలు తొలగించి మూలలంక పంట కాలువ ప్రక్షాళన చేసినప్పటికీ పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరగలేదని రైతులు, స్థానికులు వాపోతున్నారు. స్థానిక అయిభీమవరం రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద నుంచి దుంపగడప గ్రామం వరకూ ప్రవహించే మూలలంక పంటకాల్వ గత 40 ఏళ్లుగా ఆక్రమణలకు గురైంది. కాలువకు ఇరువైపులా గుడిసెలు వేసి గట్లను పూడ్చివేశారు. దీంతో పంట కాలువ గుండా సాగునీరు, తాగునీరు ప్రవహించకపోవడంతో దుంపగడప గ్రామానికి మంచినీటి చెరువుకు నీటిని వేరే పంట కాలువ ద్వారా మళ్లించారు. మూలలంక పంట కాలువ ఆయుకట్టు పూర్తిగా బీడుపడిపోయింది. సుమారు 120 ఎకరాలకు సాగు నీరందించే కాలువ పూడుకుపోవడంతో రైతులు సాగుపై ఆశలు వదులుకున్నారు. గత కొన్నేళ్లుగా పంట కాలువ ప్రక్షాళన చేయాలని రైతులు మొరపెట్టుకోగా ఇటీవల కాలువ గట్లపై ఆక్రమణలను అయిభీమవరం రోడ్డువరకూ తొలగించారు. రైతులే కాలువలో పూడికలు తీయించారు.

స్వచ్ఛ ఆకివీడు ఎక్కడ?

నగర పంచాయతీ అధికారులు కాఫీ హోటళ్లు, మాంసం దుకాణాల్లో తనిఖీలుచేసినా, ప్లాస్టిక్ వాడకాలను నిషేధించినా పంట కాలువను మురుగు కాలువగా మార్చి వేసిన సంఘటనపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ ప్రాంతం దోమలకు హేచరీగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులతోపాటు, కోళ్ల వ్యర్థాలు పారవేయడంతో బర్డ్‌ఫ్లూ వచ్చే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అంటూ శానిటరీ అధికారులు ఫొటోలకు ఫోజులిస్తున్నారే తప్ప గ్రామంలో ఇటువంటి పొంచి ఉన్న పరిణామాలపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్వచ్ఛ ఆకివీడులో భాగంగా మూలలంక పంట బోదెను బాగు చేయించాలని పలువురు కోరుతున్నారు.

కొంప ముంచిన ఆధునికీకరణ పనులు

అయిభీమవరం రోడ్డు నుంచి రైల్వే ట్రాక్ వరకూ కాలువపై ఆధునీకరణ పనులపేరుతో బాక్సు టైపు నిర్మాణం చేపట్టారు. దీంతో పూడికలు తీసే అవకాశం లేకపోవడంతో ఈ ప్రాంతంలో పూర్తిగా పంట కాలువ పూడుకుపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిల్స్, ఇతరత్రా వ్యర్థాలను పారవేయడంతో పూడికలు పేరుకుపోయాయి. దీంతోపాటు ఆ ప్రాంతంలో ఉన్న సామూహిక మరుగుదొడ్డికి చెందిన తూర కాలువలో పెట్టడంతో మల, మూత్ర విసర్జన నీరు పంట కాలువలోకి చొచ్చుకెళ్లి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో తినుబండారాలు, మాంసం దుకాణాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. పలు ఆసుపత్రుల వ్యర్థాలు కూడా మూలలంక పంట కాలువలోకి చొచ్చుకొస్తున్నాయి. పలుచోట్ల మరుగుదొడ్ల తూరలు కూడా కాలువలోకి వెళ్లేలా ఏర్పాటు చేసుకున్నారు.

పూర్తి స్థాయిలో నీరు అందించాలి

పంట కాలువల్లో కర్రనాచు, తూడు పెరిగిపోవడం వలన రైతులకు ఇబ్బందిగా మారుతుంది. ముఖ్యంగా నేలపోగుల, కొణితివాడ, రాయకుదురు పంట కాలువపై కర్రనాచు పెద్ద ఎత్తున పేరుకుపోయింది. ఇరిగేషన్ అధికారులు తక్షణం స్పందించి కర్రనాచు తొలగించి రైతులకు పూర్తిస్థాయి నీరు అందించాలి.

– కె.పెద్దిరాజు, రాయకుదురు

పేదల గుడిసెల తొలగింపు దారుణం



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భీమవరం: దౌర్జన్యంగా పేదల గుడిసెలను తొలగించడం దారుణమని, దీనికి ఎన్నికల కోడ్ అడ్డు రాలేదా అని, సీపీఎం నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక కోర్టు పక్కన పేదల గుడిసెలను పొక్లెయిన్‌తో మునిసిపల్ అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకుని పేదల ఇళ్లల్లో ఉన్న సామాన్లను బయట వేసి దౌర్జన్యం చేసి ఏడు కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని సీపీఎం వ్యతిరేకించింది. చంటి పిల్లలు, వృద్ధులు ఎక్కడికి వెళ్లాలో తెలియని స్థితిలో ఎండలో ఆకలితో అలమటిస్తూ మా గుడిసెలు తొలగించొద్దని వేడుకున్నా కనికరం లేకుండా దౌర్జన్యం చేశారు. దీనిపై సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లి పేదల తరఫున అధికారులను నిలదీశారు.వారు మాట్లాడుతూ పేదలను మనుషులుగా గుర్తించలేరా అంటూ ధ్వజమెత్తారు. ముందుగా నోటీసు ఇవ్వలేదు, చెప్పలేదు పిడుగు పడినట్లుగా వచ్చి ఇంట్లో సామాన్లు బయట పడేయడం ఈ ప్రభుత్వానికి అధికారులకు మానవత్వం ఉందో లేదో అర్థం కాని స్థితిలో ఉందన్నారు. ఓ పక్క పాలకులు పేదలే దేవుళ్లు, ప్రజల కోసమే మేమున్నామని చెబుతూ మరో పక్క దాడులు చేయడం దారుణమన్నారు. చట్ట ప్రకారం నిబంధనలను పాటించలేదని, కనీసం ప్రత్యామ్నాయం చూసుకునే అవకాశం ఇవ్వాలని వేడుకున్నా వినకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ అధికారులతో ప్రజా ప్రతినిధులతో మాట్లాడి ప్రత్యామ్నాయం చూపించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పేదలకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

శివనామస్మరణతో మార్మోగిన కలవపూడి



ఆలయంలో ప్రతిష్ఠికు సిద్ధంగా ఉన్న రాతి విగ్రహాలు



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

కాళ్ల: హరోం..హర, ఓం నమః శివాయః అంటూ కలవపూడి గ్రామం ఆదివారం శివనామస్మరణతో మార్మోగింది. మండలంలోని కలవపూడి గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఉమా భీమేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు. దీనిలో భాగంగా గత రెండు వారాలుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఎంతో సుందరంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 21వ తేదీన ప్రతిష్ఠించబోయే రాతి విగ్రహాలను అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామంలోని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నూతన విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అదే విధంగా ఈ నెల 21న శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు నూతన ఆలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, కుంబాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఎంతో చరిత్ర గల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఇప్పటికే ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన సంకేత 2025 సింపోజియం



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ గోపాల రాజు, డాక్టర్ ప్రత్యూష

భీమవరం: రెండు రోజుల పాటు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకేత 2కే25 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం ఆదివారం ముగిసింది. రెండు రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం బహుమతులు ప్రధానం చేశారు. రోటో వర్క్‌షాప్‌లో ప్రథమ స్థానం పొందిన ఎస్ఆర్‌కేఆర్ మెకానికల్ విద్యార్థులకు రూ.9 వేల నగదు బహుమతి ముఖ్య అతిథులుగా హాజరైన భీమవరం ఎస్వీఆర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎన్వీ గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మీప్రత్యూష చేతుల మీదుగా బహుమతులు అందించారు ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు మెడికల్ ఇన్నోవేషన్స్‌లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్వీ గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మీ ప్రత్యూష మాట్లాడుతూ వైద్య రంగంలో కూడా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని అందుకు అనుగుణంగా యంత్రాల్లో కూడా ఇన్నోవేటివ్ ఆలోచనలతో వస్తే పేషెంట్లకు మరింత అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన సత్తెమ్మ జాతర



పెదపుల్లేరులో కొలువైన సత్తెమ్మ అమ్మవారు

ఉండి: ఈ నెల 8న ప్రారంభమైన సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివావరం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఉండి మండలంతో పాటు కాళ్ల, పాలకోడేరు, భీమవరం, ఆకివీడు, గణపవరం తదితర మండలాల నుంచి భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలిదిండి మురళీకృష్ణంరాజు అమ్మవారికి అలంకరణ, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలిదిండి నర్సింహరాజు, వెంకట నాగసరిత, కూనాధరాజు వెంకటకృష్ణంరాజు, సాయిహషిత, కలిదిండి సత్యనారాయణ, దాట్ల శివప్రసాద్, చింతలపాటి భాస్కర శ్రీనివాసరాజు, కలిదిండి రఘు, దాట్ల వెంకటలక్ష్మీపతిరాజు, కలిదిండి సూర్యనారాయణరాజు జాతరలో అమ్మవారి అలంకరణ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ముఖ్యంగా 17వ తేదీ సోమవారం ఆలయ ప్రాంగణంలో ఉదయం పదకొండు గంటల నుంచి వేలాది మంది భక్తులకు అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు. కావున ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వహకులు తెలిపారు.

సజ్జాపురంలో అగ్ని ప్రమాదం



సజ్జాపురంలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురం అండర్ గ్రౌండ్ ప్రాంతంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జాతీయరహదారి బ్రిడ్జిని ఆనుకున్న ఉన్న ఖాళీస్థలంలో పాత సామగ్రి, చెత్త నిల్వల్లో చిన్నగా నిప్పు రాజుకుని మంటు భారీగా ఎగసిపడ్డాయి. అయితే మంటలు ఉధృతమవుతున్న సమయంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. మంటల ఉధృతి పెరుగుతుండడంతో స్థానిక భవనాల్లో నివసిస్తున్న ప్రజానీకం భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రావడంతోనే జాతీయ రహదారి బ్రిడ్జిపై నుంచి నీటిని వదలి మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం వార్త సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది కూడా స్పందించి సరఫరాను నిలుపుదల చేశారు. అయితే ప్రమాదంలో ఎటువంటి ఆస్తి నష్టంలేదని స్థానికంగా ఉన్న వృద్ధురాలు చేరవేసిన పాత సామగ్రి అంటుకుని ప్రమాదం జరిగినట్లుగా అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కలిసిన 196571 బ్యాచ్ విద్యార్థులు

ఆకివీడు: వయోభారంతో ఉన్న ఆ వృద్ధులు ఒక్కసారిగా బాలలైపోయారు. ఉదయాన్నే లేచి స్కూల్‌కు వెళ్లాలని ముస్తాబై వచ్చారు. బుడి బుడి నడకలను తలపిస్తూ వయస్సు మీద పడినా డీన వారు అడుగులో అడుగు వేస్తూ పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. స్థానిక పులవర్తి లక్ష్మణస్వామి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1965–71 బ్యాచ్ విద్యార్థులు అపూర్వ కలయిక వారిలో వృద్ధాప్యాన్ని దూరం చేసినట్లనిపించింది. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ మదిలోని జ్ఞాపకాలన్నింటినీ తీపి గుర్తులుగా నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమ బ్యాచ్‌లోని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకుని, మనవళ్లు, మునిమనవళ్లతో సంతోషంగా జీవిస్తున్నట్లు, అచ్చట్లు, ముచ్చట్లు చెప్పుకున్నారు. పాఠశాల ఆవరణలోని మంచినీటి చెరువు వద్దే ఇంటర్‌వెల్, మధ్యాహ్నం భోజన బెల్ సమయంలో ఊసులు చెప్పుకేనేవారమని బాల్య కబుర్లను బామ్మలు నెమరు వేసుకున్నారు. అర్థ శతాబ్దం తరువాత కలిసిన మన కలయిక డైమండ్ జూబ్లీకి పరుగులు తీయాలని వారు ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు కృషి చేసిన మాజీ ఉపసర్పంచ్ కొట్టు ఆంజనేయులు మాట్లాడుతూ రెండు నెలలుగా తాము చేసిన కృషి, పట్టుదల ఫలించాయన్నారు. 72 మంది విద్యార్థుల అడ్రస్సులు సేకరించి వారందరి కలయిక ఒక అద్భుతంగా ఉందని చెప్పారు. 50 ఏళ్ల తరువాత కలవడం ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో వైద్య వృత్తిలో ప్రొఫెసర్‌గా పని చేసి విశ్రాంతి పొందుతున్న గౌస్ భాషా, పాఠశాల టాపర్ ఇస్మాయిల్, సూరింటెండెంట్ ఇంజనీర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన అజీజ్ ఇక్బాల్, నటుడు ప్రేమ్‌సాగర్, ప్రముఖ రైస్ మిల్లర్లు గొంట్లా సత్యనారాయణ, నేరెళ్ల రామ రోశయ్యతో పాటు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్, తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన గురువులు మోటుపల్లి రామకృష్ణారావు, వీ.రామచంద్రరాజు, కృష్ణవేణిలను సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



ముత్యాలమ్మ అమ్మవారు



అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న భక్తులు

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, మారెమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్ల గరగలను డప్పు వాయిద్యాలతోనూ, బాణసంచాతో, శక్తి వేషధారణలతోనూ, నృత్యాలతో వైభవంగా గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. శనివారం అర్థ రాత్రి పగటిసేవ చేసి అనంతరం పద్మం నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి అమ్మవార్లకు నేవేద్యాలు, మొక్కుబడులు తీర్చుకునే భక్తులతో వీధులు కిక్కిరిసిపోయాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ నెల 21 పలు రకాల వంటకాలతో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊరేగింపులో అలరించిన శక్తి వేషధారణలు

ఎక్సైజ్ దాడులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివా రం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ. స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న దృశ్యం

భీమవరం: అట్టడుగు వర్గాల గొంతుక, ప్రజాపక్షం నిలిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దొడ్ల వీర రాఘవులు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో సుమారు 35 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాల్లో పని చేశారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సమాజంలో అణగారిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఎదుర్కొనే అనేక సమస్యలపై ఎన్నో పోరాటాల్లో భాగస్వాములు అయ్యారన్నారు. సామాన్యుడిగా ప్రజలందరి గొంతుకగా నిలబడగలిగే వ్యక్తి మన దిడ్ల వీర రాఘవులు అని అన్నారు. 2007 నుంచి ఉమ్మడి రాష్ట్రంలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి పీడీఎఫ్ కూటమిగా ఏర్పడి ప్రజా సమస్యలపై నిలదీస్తూ ఆదర్శంగా ఉన్నారన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రఘవులును గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కింతాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.